క్లుప్తంగా

శ్రీవారి సేవలో మాజీ ఎమ్మెల్యే



తిరుమలలో మాజీ ఎమ్మెల్యే విశ్వ కుటుంబ సభ్యులు

ఉరవకొండ: మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యేతోపాటు ఆయన సతీమణి భువనేశ్వరి, తనయుడు, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి శనివారం ఉదయం విరామ సమయంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు వేద పండితులు, అధికారులు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయం వెలుపల మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని, ఉరవకొండ నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

బయోమెట్రిక్ సద్వినియోగం చేసుకోవాలి

రాయదుర్గంటౌన్: రిటైర్డ్ పెన్షనర్లు జనవరి 1 నుంచి పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న పెన్షనర్ల భవనంలో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ సిస్టంను సద్వినియోగం చేసుకోవాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ బయోమెట్రిక్ ద్వారా పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్లు సబ్‌ట్రెజరీ కార్యాలయంలో అందజేస్తామన్నారు.

మేకలు, గొర్రెలకు టీకాలు



శ్రీరంగాపురంలో జీవాలకు టీకాలు వేస్తున్న డాక్టర్ రమేష్

బెళుగుప్ప: మేకలు, గొర్రెలు పారుడు వ్యాధి బారిన పడకుండా ముందస్తుగా నివారణ టీకాల(పీపీఆర్)ను అందిస్తున్నామని వెటర్నరీ డాక్టర్ రమేష్ అన్నారు. శనివారం జాతీయ పారుడు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుండ్లపల్లి, శ్రీరంగాపురం, అంకంపల్లి, యలగలవంక తండా గ్రామ సచివాలయాల పరిధిలోని 4,795 జీవాలకు టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, జీవాల కాపరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి సుభాన్

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జడ్జి సుభాన్ సూచించారు. పట్టణంలోని జ్యోతిర్మయి జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. అలాగే చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దేవేంద్ర, ఉపాధ్యక్షుడు దాదాఖాలందర్, రామాంజనేయులు, దిలీప్, తిమ్మప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కందిలో పంటకోత ప్రయోగాలు

కూడేరు: మండలంలోని తిమ్మాపురంలో బాలరాజు, మల్లికార్జునకు చెందిన కంది పంటలో శనివారం వ్యవసాయాధికారులు పంటకోత ప్రయోగాలు చేపట్టారు. బాలరాజు పొలంలో 1.2 కిలోలు, మల్లికార్జున పొలంలో 1.1 కిలోల చొప్పున దిగుబడి వచ్చినట్లు ఏఓ విజయకుమార్ తెలిపారు. తీవ్ర వర్షాభావంతో ఖరీఫ్‌లో సాగైన కందిలో దిగుబడి తగ్గిందన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది రాజకుమార్, ప్రమోద్‌సాయి, ఇన్సూరెన్స్ అధికారి రఫీ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలకు పురస్కారాలు



సమాజ సేవకులను సత్కరిస్తున్న వీట్రస్ట్ నిర్వాహకులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని వాసవీ కల్యాణ మంటపంలో శనివారం సాయంత్రం వీట్రస్ట్ జాతీయస్థాయి సమాజ సేవ పురస్కారాలను దాదాపు 50 మందికి అందజేశారు. వీట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు చెందిన సమాజ సేవకులను ఆహ్వానించి పురస్కారాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో రాయదుర్గం సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, ఆర్‌ఐ రాజు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి

- ఉష్ణోగ్రతల్లో మార్పులతో ఆరోగ్య సమస్యలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



కూడేరు: ఉదయం 8: 30 గంటల ప్రాంతంలో కమ్ముకున్న పొగమంచు

రాయదుర్గం: కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో చలి వణికిస్తోంది. గత పది రోజుల నుంచి ఉదయం పది గంటలైనా బయటకు రాలేని పరిస్థితి. చల్లగాలులకు తట్టుకోలేక వృద్ధులు, చిన్నారులు, శ్వాసకోశ వ్యాధి గ్రస్తులు అల్లాడుతున్నారు. రోజంతా ఓ మోస్తారుగా ఉంటున్న ఉష్ణోగ్రతలు రాత్రికి దారుణంగా పడిపోతున్నాయి. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా ప్రజలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువ శాతం జలుబు, జ్వరం, దగ్గు, న్యూమోనియా, ఆస్తమా లాంటి రుగ్మతులతో బాధపడుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు. చల్లటి వాతావరణానికి పెట్టింది పేరు కర్ణాటక రాష్ట్రం. సరిహద్దు ప్రాంతాల్లో ఉండే ఈ మూడు నియోజకవర్గాల్లో ఆ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఉదయం వేళ పాలు, కురగాయల వ్యాపారులు, పారిశుధ్య కార్మికులు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు చలి తట్టుకునేలా స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు ధరిస్తూ శరీరాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఉదయం తొమ్మిది గంటలు దాటిన చలిగాలుల తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. గత వారం నుంచి కనిష్ట ఉష్ణోగ్రతలు 15–20 డిగ్రీల మధ్య నమోదవుతుంది.

కమ్ముకున్న పొగమంచు

కూడేరు: మండలంలో శనివారం ఉదయం పొగమంచు దట్టంగా కమ్ముకుంది. ఉదయం 8:30 గంటలు దాటినా పొగమంచు తొలగలేదు. కనీసం మూడు అడుగుల దూరంలో ఉన్న వ్యక్తులు కనిపించనంతగా పొగ మంచు వ్యాపించింది. దీంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. అనంతపురం –బళ్లారి ప్రధాన రహదారిపై కొందరు వాహనదారులు మంచు తొలిగే వరకూ వాహనాలు ఆపుకున్నారు. మంచు ప్రభావంతో చలికి ప్రజలు వణికిపోయారు.

తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి



చలికాలంలో పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. గవద లాంటివి రాకుండా కాపాడుకోవాలి. 15 నెలల్లోపు చిన్నారులకు ఎం.ఎం.ఆర్ (మీజిల్స్, మంప్స్, రుబెల్లా) వ్యాక్సిన్ తప్పని సరిగా వేయించాలి. పిల్లలను తరచూ గమనిస్తూ ఉండాలి. ఉల్లన్ దుస్తులు ధరించాకే ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు తీసుకెళ్లాలి.

– మహేష్‌కుమార్, చిన్న పిల్లల వైద్యుడు, రాయదుర్గం

అందుబాటులో మందులు



జ్వరం, జలుబు, దగ్గు, ఆస్తమా తదితర రుగ్మలతో బాధపడేవారికి జిల్లాల్లోని అన్నీ పీహెచ్‌సీలతో పాటు సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం సరిపడేన్ని మందులు అందుబాటులో ఉంచింది. చలి కాలం ముగిసే వరకు ప్రజలు జాగ్రత్త పాటించాలి. చలిగాలులకు శ్వాసకోశ వ్యాధులు సోకకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి.

– భ్రమరాంబదేవి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, అనంతపురం

ఎమ్మెల్సీకి జూపూడి పరామర్శ



ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని పరామర్శిస్తున్న ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్లలో శనివారం ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్ పరామర్శించారు. ఎమ్మెల్సీ సతీమణి వై.ఉమాదేవమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విషయం విదితమే. ఈనేపథ్యంలో ఆయన కొనకొండ్ల గ్రామానికి వెళ్లి ఎమ్మెల్సీతోపాటు తనయుడు వై.భీమిరెడ్డిని పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ సతీమణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కణేకల్లు మాజీ ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మప్ప, ఉరవకొండ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమణా యాదవ్, నాయకులు తిప్పారెడ్డి, దుద్దేకుంట సూరి, జరుట్లరాంపురం సర్పంచు తిరుపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జూపూడికి సత్కారం

వజ్రకరూరు: మాలమహానాడు ఆధ్వర్యంలో ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్‌ను సత్కరించారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన శనివారం వజ్రకరూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను మాలమహానాడు నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం మాలమహానాడురాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలక బాలరామాంజనేయులు, జిల్లా నాయకులు నరసింహులు తదితరులు ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పలు సమస్యలను జూపూడి దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కార్యదర్శి వీరభద్రగౌడ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శర్మస్‌వలి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బెళుగుప్పలో హోరాహోరీగా తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు



బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరులో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

బొమ్మనహాళ్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామంజనేయులు అన్నారు. మండలంలోని దర్గా హొన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న కబడ్డీ, వాలీబాల్ క్రీడలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందకు ఆడుదాం–ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం సంతోషకరమన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు హలీమా, భోగేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: స్థానిక శ్రీనివాస విద్యానికేతన్ క్రీడా ప్రాంగణంలో పీడీ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కబడ్డీ పోటీలను సర్పంచ్ సాలిబాయి, కరస్పాండెంట్ శ్రీనివాసులు, హెచ్ఎం సుమ ప్రారంభించారు. బెళుగుప్ప తండాకు చెందిన బాలాజీనాయక్ టీం కబడ్డీలో అద్భుత ప్రదర్శనతో మిగిలిన టీంలను ఓడించి బెళుగుప్ప–2 సచివాలయం తరఫున ఫైనల్ చేరుకుంది. కార్యక్రమంలో కాలువపల్లి ఉన్నత పాఠశాల పీడీ చంద్రశేఖర్, కేజీబీవీ పీఈటీ సంధ్య, పంచాయతీ సెక్రటరీ వెంకటేశులు, ఆనంద్, మహేష్ పాల్గొన్నారు.



కూడేరులో టీర్టులను చూపుతున్న ఎంపీడీఓ బాషా

మండలస్థాయి పోటీలకు ఎంపిక

కూడేరు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయిలో జరిగే కబడ్డీ, క్రికెట్, బ్యాట్మింటన్, వాలీబాల్, ఖోఖో పోటీలకు 1250 క్రీడాకారులు ఎంపికయ్యారని ఎంపీడీఓ ఎంకే బాషా శనివారం తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 1,682 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆయన తెలిపారు. 26 నుంచి ప్రారంభమైన గ్రామ స్థాయి పోటీలు హోరాహోరీగా సాగాయి. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. 1250 మంది క్రీడాకారులకు ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో ముద్రించిన టీషర్టులు, టోపీలను సరఫరా చేసిందన్నారు. మండల స్థాయిలో పోటీల్లో విజేతలుగా నిలిచినవారు నియోజక వర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ, సూపరింటెండెంట్ నాగభూషణ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రఘు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ పక్కాగా చేపట్టాలి

బ్రహ్మసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఇంటివద్దకే రేషన్ బియ్యం పంపిణీ (డోర్ డెలివరీ) పథకాన్ని పక్కాగా అమలు చేయాలని తహసీల్దార్ వాణిశ్రీ సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శ్రీనాథరెడ్డి, ఆర్ఐ నాగిరెడ్డితో పాటు మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు.

నోటు పుస్తకాల పంపిణీ

వజ్రకరూరు: మండలంలోని కమలపాడు, గూళ్యపాళ్యం ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు శనివారం సుజలాన్ ఫౌండేషన్ మాస్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలతో కూడిన కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు కురుబ తిరకమ్మ, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రవీణ్, ఫీల్డ్ కోఆర్డినేటర్ నరసింహులు, హెచ్ఎం వేణుగోపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

బొమ్మనహాళ్: 2024 యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను శనివారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ వీరన్న, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు రాజ్‌కుమార్, మండల ట్రెజరర్ అశోక్, మహిళా కన్వీనర్ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు వరిగడ్డి వితరణ

కణేకల్లు: మండల కేంద్రానికి చెందిన కటిక ఉదయ్ అనంతపురంలోని ఇస్కాన్ గోశాలకు ఉచితంగా ఒక ట్రాక్టర్ వరిగడ్డి వితరణ చేశారు. ట్రాక్టర్‌ను శనివారం అనంతపురానికి పంపారు. గోశాల నిర్వాహకులు ఆయనను అభినందించారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీలో చోటు



బంగి శివ

రాయదుర్గంటౌన్: అనంతపురం ఉత్తర ప్రాంత ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రాయదుర్గం పట్టణానికి చెందిన బంగి శివను రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కాకినాడలో జరిగిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల్లో తనను ఎన్నుకున్నారన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు.

వైభవంగా ఉరుసు



కొనకొండ్లలో స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల, గూళ్యపాళ్యం గ్రామాల కొండ మీద శనివారం గురు సయ్యద్ మీరా మహమ్మద్ అష్రఫ్‌షా ఖాదరిస్వామి 162వ ఉరుసు వైభవంగా నిర్వహించారు. ఉదయం కొనకొండ్ల నుంచి కొండ మీదకు పూలతో అలంకరించిన స్వామిని ఊరే గింపుగా తీసుకువెళ్లారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనల అనంతరం చక్కెర చదివింపులు, జియారత్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

హజరత్ ఇమాంషావలి ఉరుసు ప్రారంభం



గంధాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం



వేడుకలకు హాజరైన భక్తులు

కణేకల్లు: మండలంలోని మాల్యం గ్రామంలో హజరత్ ఇమాంషావలి ఉరుసు శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పాతూరులోని ముల్లా పెద్ద ఆదంసాబ్ ఇంటి నుంచి గంధాన్ని సంప్రదాయ ప్రకారం దర్గా వరకూ పక్కీర్లతో కలసి మేళాతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చారు. దర్గాలో ప్రత్యేక ఫాతేహాల చదివించిన అనంతరం గంధాన్ని హజరత్ ఇమాంషావలికి సమర్పించి పూల చద్దర్‌ను పరిచారు. కార్యక్రమంలో నిర్వాహకులు యూనుస్, మాబు, ముల్లా కుటుంబీకులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు



మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య అన్నారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో శనివారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు వలంటరీ రిటైర్‌మెంట్ కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదన్నారు. పనిచేసిన కాలంలో చేసిన మంచి తోడుగా ఉంటుందన్నారు. అనంతరం కమిషనర్ దంపతులకు జ్ఞాపికను అందజేసి దుశ్శాలువాతో ఎంపీ సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీఓ డాక్టర్ రాణి సుస్మిత, డీఎల్‌డీఓ శంకర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, మున్సిపల్ చైర్మన్ తలారి రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ జయం ఫణి, పార్టీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, కౌన్సిలర్లు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

లంపీ స్కిన్ నివారణకు టీకాలు



కెంచంపల్లిలో పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్యులు

కుందుర్పి: లంపీ స్కిన్ వ్యాధి నివారణకు రైతులు పశువులకు టీకాలు వేయించాలని స్థానిక పశువైద్యాధికారి ప్రసాద్ సూచించారు. శనివారం వెటర్నరీ సిబ్బంది మండలంలోని కెంచంపల్లి, కలిగొలిమి, అప్పాజిపాళ్యం, జంబుగుంపల గ్రామాల్లో 350 పశువులకు లంపీ స్కిన్ వ్యాధి టీకాలు, 97 లేగ దూడలకు నట్టల నివారణ టీకాలు వేశారు. అలాగే 13,256 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు అందజేశారు. గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ అన్ని గ్రామాల గోపాల మిత్రల వద్ద అందుబాటులో ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే స్థానిక పశువైద్యశాలలో 2 వేల క్వింటాళ్ల గడ్డి విత్తనాలు అందుబాటులో ఉంచామని పశువైద్యాధికారి తెలిపారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్ అందజేస్తే సబ్సిడీతో విత్తనాలు అందజేస్తామన్నారు.

గడప గడప నిధులతో గ్రామాలకు మహర్దశ



గతంలో పాల్తూరు గ్రామంలోని తాయమ్మకట్ట రోడ్డు దుస్థితి



గడప గడప నిధులతో సుందరంగా కన్పిస్తున్న సిమెంట్ రోడ్డు

ఉరవకొండ: విడపనకల్లు మండలంలోని పాల్తూరు పంచాయతీ పరిధిలో గతంలో ఏ వీధికి వెళ్లినా బురదమయంగా కన్పించేది. కనీసం అడుగు ముందుకు వేయలేని దుస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి కృషి ఫలితంగా పాల్తూరు గ్రామ రూపురేఖలు మారాయి. ఇటీవల నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాయమ్మకట్ట కాలనీవాసులు రోడ్డు వేయాలని మాజీ ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ బీవలారాణి పర్యవేక్షణలో రూ.10 లక్షల 'గడప గడప' నిధులతో సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులు మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

2 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న రెండో విడత 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని మండలంలో జనవరి 2 నుంచి నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ శనివారం తెలిపారు. 2న గొటుకూరు, 9న ఇప్పేరు, 19న కమ్మూరు, 23న మరుట్ల, 30న జల్లిపల్లి, ఫిబ్రవరి 6న కొర్రకోడు, 13న చోళసముద్రంలో నిర్వహిస్తామన్నారు. అలాగే 20వ తేదీ విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లు, 27న విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లు, మార్చి 3న కూడేరు సచివాలయం–2లో హెల్త్ క్యాంపులు నిర్వహించి నిపుణులచే వైద్య సేవలు అందజేస్తామన్నారు. మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గుమ్మఘట్ట మండలంలో 5 నుంచి..

గుమ్మఘట్ట: మండలవ్యాప్తంగా జనవరి 5 నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించి వైద్యబృందంచే నాణ్యమైన వైద్య సేవలు అందజేస్తామన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం



కోనాపురంలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



రథోత్సవంలో పాల్గొన్న ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి

గుమ్మఘట్ట: మండలంలోని కోనాపురంలో ఆంజనేయ స్వామి రథోత్సవాన్ని గ్రామస్తులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మూలవిరాట్‌కు ఆలయంలో వేకువజామున ఆకుపూజ, కుంకుమార్చన, పుష్పాలంకరణ, పంచామృతాభిషేకం, మహా మంగళారతి తదితర పూజలు చేపట్టారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంలో అధిష్టించి గ్రామంలో ఊరేగించి మొక్కులు తీర్చుకున్నారు. రథం ముందు యువకులు నంది కోళ్లతో నృత్యం చేస్తూ చిందులు వేశారు. ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రథాన్ని లాగి ప్రారంభించారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నమో ఆంజనేయా..

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంతోపాటు భైరసముద్రం, చెటిమేపల్లిలో ఆంజనేయ స్వామి రథోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు , హోమాలు చేపట్టారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాలను రథంలో ప్రతిష్ఠించి డప్పువాయిద్యాలు, నంది కోళ్ల కోలాహలం నడుమ అంజన్న నామ స్మరణతో రథోత్సవం ముందుకుసాగింది. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎస్ఐ పరుశురాముడు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



బ్రహ్మసముద్రంలో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు